

భారీగా పడిపోయిన కోడి మాంసం ధరలు

# చికెన్ ధర మస్తు అగ్గువ

ఇటీవల 70శాతం వరకు తగ్గిన రేట్లు

అమ్మకాలపై ప్రభావం..

40శాతం సేల్స్ డౌన్

కిలో డ్రెస్సడ్ రూ.135

స్కిన్‌లెస్ రూ.160

ఎన్నికలకు ముందు చికెన్ రూ.240

స్కిన్‌లెస్ రూ.260

కార్తిక మాసం, మాలధారణలు, ఎన్నికలు ముగియడంతో తగ్గిన సేల్స్

నష్టాల్లో పౌల్ట్రీ వ్యాపారులు

**చికెన్ అంటే ఇష్టపడే వారు చాలామందే ఉన్నారు. కొంత మంది వారంలో రెండు, మూడు సార్లు చికెన్‌ను తింటారు. అయితే రెండు నెలల క్రితం చికెన్ రేట్లు అమాంతం పెరిగిపోయాయి. ఒకానొక సమయంలో కిలో రూ.300దాటింది. రెండు నెలల క్రితం కిలో డ్రెస్సడ్ చికెన్ రూ. 240, స్కిన్‌లెస్ రూ.260, బోన్‌లెస్ రూ.480, లైవ్ రూ.140గా ఉంది. కానీ ఇటీవల చికెన్ ధరలు తగ్గుతూ 70 శాతం వరకు పడిపోయాయి. ప్రస్తుతం భువనగిరిలో కిలో డ్రెస్సడ్ చికెన్ రూ.135, స్కిన్‌లెస్ రూ.160, బోన్ లెస్ రూ.320, లైవ్ బర్డ్ రూ.70గా ఉంది. దాంతో మాంసం ప్రియులు ఖుష్ అవుతున్నారు.**

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) నేరేడుచర్ల

## కార్తిక మాసం కావడంతో..

చికెన్ ధరలు తగ్గడానికి వ్యాపారులు పలు కారణాలు చెబుతున్నారు. కోళ్లు ఒక సైజ్ వరకు వచ్చిన తర్వాత కచ్చితంగా అమ్మాల్సి ఉంటుంది. లేకుంటే వాటికి మేత ఎక్కువవడంతోపాటు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ తగ్గి, కోళ్లు భారీగా రావడంతో సాధారణంగా ధర తగ్గింది. ఎన్నికల నేపథ్యంలో డిమాండ్ బాగా ఉంటుందని వ్యాపారులు పెద్ద ఎత్తున సీడ్ వేశారు. తీరా ఎన్నికల్లో అనుకున్న స్థాయిలో కోళ్లు అమ్ముడుపోలేదు. ఎన్నికల సమయంలో అంతో ఇంతో ధర పలికినా.. ఎలక్షన్లు ముగియడంతో ధర పడిపోయింది. దాంతో పాటు ప్రస్తుతం కార్తిక మాసం నడుస్తున్నది. ఈ నెలలో పూజలతోపాటు అయ్యప్ప, భవాని, శివ భక్తులు మాంసానికి దూరంగా ఉండటంతో అమ్మకాలు తగ్గాయి.



## నష్టాల్లో పౌల్ట్రీ వ్యాపారులు

ధరలు, అమ్మకాలు పడిపోవడంతో పౌల్ట్రీ వ్యాపారులు తీవ్ర నిరాశలో ఉన్నారు. రోజు రోజుకు ధరలు తగ్గుతుండడంతో నష్టాల పాలవుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉత్పత్తి భారీగా పెంచారు. లక్ష పిల్లలకు బదులు రెండు లక్షల ఉత్పత్తి పెరిగింది. కానీ లక్ష కూడా అమ్ముడుపోక పోవడంతో పౌల్ట్రీ వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లాభాలు రావడం పక్కనపెడితే.. రెండింతలు నష్టాలు వచ్చాయని వాపోతున్నారు. ఇక చికెన్ అమ్మకం దారులదీ ఇదే పరిస్థితి. గిరాకీ లేక రోజంతా ఖాళీగా కూర్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరాయిలు, లేబర్, ఇతర ఖర్చులు సొంతంగా భరించాల్సి వస్తుందని చెబుతున్నారు. కాగా కార్తిక మాసం ముగిశాక ధరలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

## 40శాతం అమ్మకాలు తగ్గాయి



చికెన్ ధరలు వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. రెండు నెలల క్రితంతో పోలిస్తే 50 నుంచి 70 శాతం వరకు రేట్లు పడిపోయాయి. దాంతో అమ్మకాలు కూడా తగ్గాయి. ఎన్నికల్లో ఎక్కువగా సేల్ అవుతుందని వ్యాపారులు అధిక మొత్తంలో సీడ్ వేశారు. కానీ అనుకున్న స్థాయిలో విక్రయాలు జరుగలేదు. కార్తికమాసం, మాలధారణలతో కూడా మాంసం అమ్మకాలు తగ్గాయి. కిరాయిలు, లేబర్‌కు సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టుకుంటున్నాం.

**– రత్న దిలీప్, చికెన్ వ్యాపారి, భువనగిరి**

## వ్యాపారం తగ్గింది

కార్తిక మాసం కారణంగా వ్యాపారం బాగా తగ్గింది. డ్రస్సుడ్ చికెన్ ధర గతంలో రూ.230 ఉండగా ప్రస్తుతం రూ.135కు పడిపోయింది. మరో పది రోజులు పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని భావిస్తున్నాం. ప్రస్తుతం ధర తగ్గినప్పటికీ వ్యాపారం మాత్రం పుంజుకోవడం లేదు. గతంలో ప్రతి రోజు రూ.20వేల వరకు వ్యాపారం సాగితే నేడు రూ.10వేలు కూడా సాగడం లేదు. దుకాణంలో పనులు లేక వర్కర్స్ ఖాళీగా ఉంటున్నారు.



**– గంట సైదులు, చికెన్ సెంటర్ యజమాని, నేరేడుచర్ల**

# 68 ఆధునిక దేవాలయానికి వసంతాలు

## స్వదేశీ పరిజ్ఞానానికి నిదర్శనం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్

**బీడు భూములను సస్యశ్యామలం చేసిన కల్పతరువు**

**22లక్షల ఎకరాలకు సాగునీరు.. వేలాది గ్రామాలకు తాగునీరు**

**ముక్తాల రాజు ఆలోచనలతో ప్రాజెక్టుకు నాంది**

**1955 డిసెంబర్ 10న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన**

**1967లో ఎడమ, కుడి కాల్వలకు నీటిని విడుదల చేసిన నాటి పీఎం ఇందిరాగాంధీ**

**నేడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఫౌండేషన్ డే**

నందికొండ, డిసెంబర్ 9 : తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు సాగు, తాగు నీటిని అందిస్తూ అన్నపూర్ణగా విరాజిల్లుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు పునాదిరాయిపడి నేటికి 68 ఏండ్లు పూర్తయ్యాయి. దాంతో సాగర్ ప్రాజెక్ట్ ప్రస్తుతం 69వ వసంతంలోకి అడుగిడింది. రైతులు కరువుతో విలవిల్లాడుతున్న సమయంలో ముక్త్యాల కోట రాజైన రాజా రామగోపాల్ కృష్ణ మహేశ్వరప్రసాద్ ఆలోచనతో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి బీజం పడింది. 1908న కృష్ణా నదిపైన పులిచింతల వద్ద ప్రాజెక్ట్ కట్టేందుకు అనువుగా ఉందని బ్రిటీశ్ ఇంజినీర్లు కర్నల్ ఎల్లిస్, సీటీ మార్లింగ్స్ తెలిపినప్పటికీ కొన్ని అనివార్య కారణల వల్ల అప్పట్లో ప్రాజెక్ట్ నిర్మాణం ఆగిపోయింది. అనంతరం ఖోస్లా కమిటీ సూచనలతో 1954 డిసెంబర్ 17న అప్పటి గవర్నర్ త్రివేది నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు. 1955 డిసెంబర్ 10న ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రాజెక్ట్ నిర్మాణానికి నందికొండలోని పైలాన్‌కాలనీలో పిల్లర్ ఏర్పాటు చేసి శంకుస్థాపన చేశారు.



నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ (ఫైల్)

### బహుళార్థ సాధక ప్రాజెక్ట్


నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో నందికొండ గ్రామం వద్ద కృష్ణానదిపై బహులార్థక సాధక ప్రాజెక్ట్‌గా నాగార్జునసాగర్‌ను నిర్మించారు. ఆధునిక దేవాలయంగా కీర్తించబడుతున్న మానవ నిర్మిత అతి పెద్ద రాతికట్టడం కావడంతో ఈ ప్రాజెక్ట్ చరిత్ర పుటల్లో నిలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌తో తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల్లోని 25 లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుండడంతో వేల రైతు కుటుంబాలు పాడి పంటలతో సంతోషంగా జీవనం సాగిస్తున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ద్వారా చేపడతున్న విద్యుత్ ఉత్పత్తితో పరిశ్రమల మనుగడ కొనసాగుతుండడంతో వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి.

### ఘనమైన చరిత్ర

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మించిన ప్రాంతానికి పురాణకాలం నుంచి ఘనమైన చరిత్ర, ఎనలేని ప్రాశస్త్యం ఉంది. మహాయన మాధ్యమిక ప్రముఖుడు ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో బౌద్ధరామం నెలకొల్పి, దేశ విదేశాల విద్యార్థులకు విద్యను బోధించడంతో ఈ ప్రాంతం అంతర్జాతీయ స్థాయిలో విశ్వ విద్యాలయంగా వెలుగొందింది. దాంతో ఈ ప్రాంతంలో నిర్మించిన ప్రాజెక్ట్‌కు ఆచార్య నాగార్జునుడి పేరుతో నాగార్జునసాగర్ డ్యాంగా పెట్టారు. తెలంగాణ ఏర్పాటయ్యాక గత ప్రభుత్వం నాగార్జునసాగర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో పాటు గత చరిత్రను భావితరాలు గుర్తుంచుకునేలా దీనికి నందికొండ మున్సిపాలిటీగా పేరు పెట్టింది.

### భారతీయ ఇంజినీర్ల ప్రతిభ

భారతీయ ఇంజినీర్లు తమ ప్రతిభతో మొట్టమొదటిసారిగా అతి పెద్ద రాతి కట్టడమైన నాగార్జునసాగర్ డ్యాంను నిర్మించి యావత్ ప్రపంచ సాంకేతిక లోకమే అబ్బుర పడేలా చేశారు. ప్రపంచంలోనే రాతి అనకట్టల్లో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ మొదటిది. 1955 నుంచి 1967 వరకు దాదాపు 12 సంవత్సరాల పాటు పూర్తిగా స్వదేశీయ ఇంజినీర్ల పరిజ్ఞానంతో, లక్షలాది మంది కూలీల భాగస్వామ్యంతో ప్రాజెక్ట్ నిర్మించారు. డ్యాం నిర్మాణ సమయంలో ప్రతిరోజు దాదాపు 500 మంది ఇంజినీర్లు, 500 మంది వర్కుచార్జ్ ఉద్యోగులు, 40 వేల మంది కూలీలు పనులు నిర్వహించేవారు.




ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో పనిచేస్తున్న కూలీలు (ఫైల్)

### కుడి, ఎడమ కాల్వల నిర్మాణం

సాగు, తాగునీటి అవసరాల కోసం కుడి వైపు జవహర్ కాల్వను, ఎడమవైపు లాల్‌బహద్దూర్ కాల్వను ఏర్పాటు చేశారు. ఈ కాల్వల ద్వారా 18.94 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ఈ కాల్వలకు 132 టీఎంసీల నీటిని కేటాయించారు. 1967 ఆగస్టు 4న ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా నిర్మించారు. ఆనాటి భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విద్యుత్‌కేంద్రాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

### డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం ఇలా..

1930లో నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులకు సాగునీటిని అందించేందుకు ప్రాజెక్ట్ నిర్మించాలని భావించిన ఆనాటి నైజం నవాబు మద్రాసు, బ్రిటిశ్ ప్రభుత్వాన్ని అనుమతి కోరగా అది కార్యరూపంలోకి రాలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆలోచన మొదలైంది. సముద్రమట్టానికి 546 అడుగుల ఎత్తులో ఆనకట్ట నిర్మించి నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీటిని అందించాలని భావించారు. నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణ ప్రాంతాన్ని మొదటగా చీఫ్ ఇంజినీర్ అలీనవాబ్ జంగ్ సర్వే చేసి పథకాన్ని రూపొందించారు. డ్యాంతో పాటు ఎడమ, కుడి కాల్వలు, ప్రధాన డ్యాం వద్ద జలవిద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసి 1.63 లక్షల కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేలా డ్యాంను నిర్మించారు.



ప్రపంచంలోనే పొడవైన రాతికట్టడం

రాతి కట్టడం పొడవు 4,758 అడుగులు, 408 అడుగుల ఎత్తుతో, అడుగున 287.9 నుంచి 300 అడుగుల వెడల్పుతో 79 బ్లాకులుగా ప్రాజెక్ట్ నిర్మించారు. రెండు నాన్ ఓవర్ ఫ్లో సెక్షన్ల మధ్య 546 అడుగుల పైన 45, 44 అడుగులతో 26 రేడియల్ క్రస్ట్ గేట్లను ఇంజినీర్ కేఎల్‌రావు పర్యవేక్షణలో అమర్చారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులకు చేరుకున్నపుడు 26 క్రస్ట్ గేట్ల ద్వారా 11,70,000 క్యూసెక్కుల వరద నీటిని ప్రధాన డ్యాం దిగువ భాగంలో 1540 అడుగుల నిడివి గల స్పిల్‌వే మీదుగా దిగువకు విడుదల చేసేలా రూపొందించారు.

### జలాశయం విస్తీర్ణం 110 చదరపు మైళ్లు

నాగార్జునసాగర్ జలాశయ విస్తీర్ణం 110 చదరపు మైళ్లు. గరిష్ట నీటి మట్టం 590 అడుగులకు 408.24 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. అయితే పూడిక వల్ల ప్రస్తుత నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలకు చేరుకుంది. డెడ్‌స్టోరేజీ 490 అడుగులు. రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలంటే కనీసం నీటిమట్టం 510 అడుగులు ఉండాలి.

### రూ. 20 కోట్లతో స్పిల్‌వే మరమ్మతు చేశాం

డ్యాంసేఫ్టీ రివ్యూప్యానల్ కమిటీ సూచనల మేరకు నాగార్జునసాగర్ ఆధునీకరణలో భాగంగా డ్యాంకు పూర్తి స్థాయిలో మరమ్మతులు నిర్వహించారు. ఈ ఏడాది రూ. 20 కోట్ల వ్యయంతో స్పిల్‌వే పనులు పూర్తి చేశాం. డ్యాం నిర్వహణను పటిష్ట పర్చాం. ఈ ఏడాది కృష్ణానదిలో నీటి లభ్యత లేనందున తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగిస్తున్నాం.



**– ధర్మానాయక్, నాగార్జునసాగర్ డ్యాం ఎస్ఈ**



బడిబయటి పిల్లల కోసం ప్రత్యేక సర్వే

# బాల్యానికి భరోసా

ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు నిర్వహణ

మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ

సేకరించిన వివరాలు ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్


భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 9 : బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి స్కూల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నెల 11 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 10 వరకు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టనున్నారు. బడిబయటి పిల్లలను గుర్తించిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. అందుకోసం ప్రబంధ్ పోర్టల్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతి కాంప్లెక్స్ పాఠశాల పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు(సీఆర్‌పీ) ఈ బాధ్యతను అప్పగించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 712 పీఎస్, యూపీఎస్, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు ఉండగా అందులో 45,690 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సీఆర్‌పీలు ఇంకా బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వయస్సును బట్టి ఆయా స్థాయి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. గత విద్యాసంవత్సరం నిర్వహించిన సర్వేలో 550 మంది పిల్లలను గుర్తించి ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, బ్రిడ్జికోర్సుల ద్వారా విద్యను అందించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

### 11 నుంచి సర్వే షురూ

ఈ నెల 11 నుంచి సీఆర్‌పీలు తమ పరిధిలోని గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించే పనిని ప్రారంభించనున్నారు. జనవరి 10 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. సర్వేల్లో బడిబయట ఉన్న 6 నుంచి 14, 15 నుంచి 19 ఏండ్ల పిల్లలను గుర్తించి విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో రోజు వారి వివరాలను నమోదు చేయనున్నారు. ప్రతి రోజు ఆయా క్లస్టర్ పరిధిలో ఎంత మంది పిల్లలను గుర్తించారనే విషయాన్ని నమోదు చేయనున్నారు.

### మూడు స్థాయిల్లో గుర్తింపు

బడి బయటి పిల్లలను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 50 కాంప్లెక్స్‌లకు సంబంధించిన 57 మంది సీఆర్‌పీలు సర్వే చేపట్టనున్నారు. సీఆర్‌పీ సేకరించిన సమగ్ర సమాచారం మొదటి స్థాయిల్లో ఆయా కాంప్లెక్స్ పరిధిలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, రెండవ స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి, మూడవస్థాయి జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో జరుగనుంది. ఈ క్రమంలో చేపట్టిన సర్వేల్లో బడిబయటి పిల్లల గుర్తింపు పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



### సమగ్రంగా సర్వే

విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నాం. సర్వేను కాంప్లెక్స్‌ల వారీగా ఉన్న సీఆర్‌పీలతో పూర్తిస్థాయిలో చేపట్టనున్నాం. అందుకోసం 50 కాంప్లెక్స్‌ల పరిధిలోని సీఆర్‌పీలను వినియోగిస్తున్నాం. 6 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న బడి బయటి పిల్లలను గుర్తించి ప్రతి రోజు ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తాం. జిల్లాలో బడిబయటి పిల్లలను పూర్తిస్థాయిలో పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా పనిచేస్తాం.

**–కె. నారాయణరెడ్డి, డీఈఓ, యాదాద్రి భువనగిరి జిల్లా**



# రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- యాదాద్రి కలెక్టర్ హనుమంతు కె జెండగే
- భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాట్ల పరిశీలన

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 9 : భూదాన్ పోచంపల్లికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 20న రానున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతు కె జెండగే తెలిపారు. శనివారం వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ ఆఫీస్ ఆఫ్ డెవలప్‌మెంట్ కమిషనర్ పర్ హ్యాండ్లూమ్స్ అరుణ్‌కుమార్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సభావేదిక, రంజన్‌యూనిట్, వీవింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చేనేత ఔన్నత్యం ప్రతిబింబించేలా థీమ్ పెవీలియన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తేలియా రుమాలు, ముచ్చంపేట చీరెలు, సిద్ది పేట గొల్లభామ చీరెలు, ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు చేనేత మగ్గాల ప్రదర్శన ఉంటుందని, చేనేత ప్రాశస్త్యాలను తెలిపేలా పనులు జరుగుతున్నాయని తెలిపారు. చేనేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ విద్యాసాగర్, తాసీల్దార్ వీరబాయి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, టైఅండ్ఐ అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, నాయకులు ఎన్నం శివకుమార్, భారత లవకుమార్, ముస్కూరి నర్సింహ, పాలాది యాదగిరి పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలోని బాలాజీ ఫంక్షన్‌హాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె జెండగే